క
థ

# మార్పు

హేమంతం! ఆరోజు పదకొండుగంటలైనా చలి తగ్గలేదు. అందుకే మా ఇంటి ముంగిట్లో ఉన్న వేపచెట్టు కింద కూర్చొని నీరెండ వెలుగులో పేపరు చదువుకుంటున్నాను. ఇంతలో పోస్ట్‌మేన్ వచ్చి ఒక ఉత్తరాన్నిచ్చి వెళ్ళిపోయాడు. అది నా స్నేహితుడు రమణమూర్తి వ్రాసిన ఉత్తరం. చదవడం మొదలుపెట్టాను.

ప్రియమైన రంగనాధానికి,

రమణమూర్తి వ్రాయునది. ఉభయకుశలోపరి. నువ్వు ఉత్తరంలో వ్రాసినట్లు మా తమ్ముడి కూతుర్ని మీ అబ్బాయికిచ్చే విషయమై వాడితో సంప్రదించాను. మీవాడి ఫోటో, జాతకం అన్నీ ఇచ్చాను.

అయితే వాడు అన్నీ బాగున్నాయికానీ ఇద్దరికీ వయోబేధం ఎక్కువగా ఉందనీ అదీకాక తన కూతురు ఇంజనీరింగ్ చదువుకుంది కాబట్టి వరుడు కూడా ఇంజనీరింగ్ అయితే బాగుంటుందనీ, కానీ మీ అబ్బాయి ఎమ్‌సిఏ కాబట్టి ఈ సంబంధం కుదరదనీ చెప్పి నిన్ననే ఫోటో, జాతకం తిరిగి పంపించేశాడు. ఈ ఉత్తరంతోపాటు ఆ ఫోటో, జాతకం నీకు తిరిగిపంపిస్తు న్నాను.

ఇంకేదైనా సంబంధం ఉంటే తప్పక నీకు తెలియచేస్తాను. చెల్లెమ్మ జానకిని అడిగినట్లు చెప్పు.

ఉంటాను.

రమణమూర్తి

ఆ ఉత్తరం చదివిన తరువాత నాకు నిరాశ ఆవహించింది. ఏదో ఈ సంబంధం అయినా కుదిరితే ఒక్కగానొక్క కొడుకు రఘు పెళ్ళి చేసెయ్యొచ్చని ఆశపడ్డాను. ఇప్పటికే వాడి వివాహం బాగా ఆలస్యమైపోయింది!

నేను మొన్న జూన్‌లో హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా చేసి పదవీ విరమణ చేశాను. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు రఘు ఎమ్‌సిఏ చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు.రెండోది భాను. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.

రఘు ఉద్యోగంలో చేరిన రెండేళ్ళదాకా పెళ్ళిచేసుకోనన్నాడు. ఆ తరువాత వాడికి సంబంధాలు చూడటం మొదలుపెట్టాను. అప్పటికే వాడి వయస్సు ఇరవై ఎనిమిదేళ్ళు నిండిపోయాయి! అయినా వాడేమీ ఆడపిల్ల కాదు కదా సంబంధాలు కుదరకపోవడానికనీ అనుకున్న నాకు అదెంత కష్టమో సంవత్సరం తిరిగేసరికి తెలిసిపోయింది.

అప్పటికే మా చుట్టాలకి, స్నేహితులకు వాడి ఫోటోలు, జాతకం ఇచ్చి ఎక్కడైనా మంచి సంబంధాలుంటే చూడమనీ చెప్పడం జరిగింది. అందువల్ల చాలా సంబంధాలు వచ్చాయి కానీ అన్నింట్లోనూ ఏవో సమస్యలు... చాలా సంబంధాలు వయో బేధం కారణంగా తప్పిపోవడం నాకు ఆశ్చర్యమనిపించింది. సంబంధాలు చూసే సమయానికి వాడికి ముప్ఫైఏళ్ళు వచ్చేసాయి. ఈ కాలంలో ఆడపిల్లలు తమకన్నా అబ్బాయికి రెండుమూడేళ్ళకన్నా ఎక్కువ తేడా అయితో ఒప్పుకోవడంలేదు.

మరికొన్ని జాతకాలు నప్పక, ఇంకొన్ని సంబంధాలు పిల్లపొడుగ్గా ఉండటంవల్ల, మరికొన్ని తమకు అమెరికాలో పనిచేస్తున్న అబ్బాయే కావాలని అమ్మాయి తల్లి దండ్రులు పట్టుబట్టడంవల్ల... ఇలా ఎన్నో సంబంధాలు తప్పిపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మరీ ముఖ్యంగా చాలా సంబంధాలు పిల్లవాడు ఇంజనీరింగ్ చదవలేదనీ తప్పిపోవడం నాకు ఆందోళన కలిగించ సాగింది. నేను వాణ్ణి ఎమ్‌సెట్ రాయించి ఇంజనీరింగ్ చదివించనందుకు అప్పుడు చాలా బాధపడ్డాను.

ఈరోజుల్లో ప్రతి తల్లిదండ్రులు తమ అమ్మాయిల్ని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. అందువల్ల

గన్నవరపు నరసింహమూర్తి

పెళ్ళికొడుకులు ఇంజనీరింగ్ చదివేవాళ్ళు కావాలనీ కోరుకుంటున్నారు. దాంతో మా రఘులాంటి ఇంజనీరింగ్ చదవని వాళ్ళకి సంబంధాలు కుదరడం కష్టమై పోతోంది.

మా అబ్బాయికి సంబంధాలు కుదరకపోవడానికి ఇంకొక ముఖ్యకారణం ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం అనీ ఈమధ్యనే నేను గమనించాను. ఇరవై ఏళ్ళ క్రితం ఆడపిల్లలు పుడితే పెళ్ళిళ్ళు చెయ్యడం కష్టం అనీ ఆనాటి తల్లిదండ్రులు, సమాజం బాధించడంవల్ల అప్పట్లో ఆడపిల్లలమీద మక్కువ చూపక పోవడంవల్ల ఈనాడు వాళ్ళ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

ఈమధ్యన రఘుకు తనకు ముప్ఫై నిండిపోయినా పెళ్ళికాలేదన్న బెంగపట్టుకుంది. అదే ముప్ఫై ఏళ్ళ ఫోబియా! ఇది బ్రహ్మచారులకు ఆందోళన కలిగించి ముదిరిపోయిన బెండకాయలుగా ముద్రవేయించుకునే వయస్సు. అందుకే వాడు తరచూ వాళ్ళమ్మకు ఫోన్లు చేస్తూ ఏదో సంబంధం చూసి ఖాయం చేయమనీ పోరుపెడుతున్నాడు.

ఇంతలో మా తెలుగు మాష్టారు రాజశేఖరం రావడంతో ఆలోచనల్లోంచి బయటపడ్డాను. అతన్ని చూస్తూనే "రండి మాష్టారూ! కూర్చోండి" అంటూ

## అమ్మ... అమ్మనే!

అమ్మ ప్రేమకావాలని
ఎన్నేళ్ళనుండి ఏడుస్తున్నా
మరో అమ్మ నాన్నకు దొరికిందిగానీ
అమ్మలోని అమ్మమాత్రం తనక్కనిపించట్లేదు
ఎండిపోయిన కన్నీళ్ళ కళ్ళగుంటల్లో
తననూ, అక్కను దాచుకుందిగానీ
ఆ కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయినందుకే
తమకు చిరునామా కరువయ్యింది
నాన్న అమ్మను ప్రేమించేవాడో... కాదో... గానీ
అమ్మలో ఎప్పుడూ నైరాశ్యం నాట్యం చేస్తుండేది
నిజమే మరి
ప్రేమించడం ఆడవాళ్ళకే తెలుసుకాబట్టీ
అక్కడే మోసపోతుంటారు వాళ్ళు
అమ్మ జీవితం ఆకురాలుకాలపు చెట్టే అయినా
ఏరోజూ చిగురు కనిపించేదికాదు
అంతుపట్టని లోతు వుందనుకున్నా
ఆవేశంతో అలలొచ్చేవికావు
అమ్మ ఎవరికైనా అమ్మే కాబట్టి
బాధల్ని మింగుతూనే నాన్నకు భార్యగా వుండింది
అవధానం అలవాటైన అమ్మను
ఎవరెన్ని అప్రస్తుత ప్రసంగాలు వినిపించినా
సావధానంగానే సంసారం నడిపించేది
అనూహ్యమైన ప్రేమల్ని పంచేది
నాన్న ఎలాంటి వాడని ఎవరికీ చెప్పలేదుగానీ
అతడు ప్రేమిస్తే, మరికొంతకాలం బతికేదమ్మ
ప్రేమించే అమ్మ వెళ్ళిపోయినందుకే
ఆ ప్రేమ ఎక్కడా దొరకడంలేదనేదే బాధ
అన్నీ అందుబాటులో వుండే ప్రపంచీకరణలో
అమ్మ ప్రేమగురించి ఆలోచిస్తుంటే
బ్రహ్మాండంలో శూన్యం కనిపిస్తోందీ
అమ్మ ప్రేమ కరువైపోతోంది
వెళ్ళిపోయిన అమ్మ గురించి
వెక్కి వెక్కి ఏడ్చినా
గుక్కపట్టి ఏడ్చినా
అమ్మ కనిపించదుగానీ ఆశీర్వదిస్తుంది

కన్నోజు లక్ష్మీకాంతం

## రైతుగోస

నేటి వ్యవసాయం
ఓ మాయాజూదం
అడుగడుగునా శకునిమామలు
నకిలీ విత్తనాలు
కల్తీ ఎరువులు
నకిలీ పురుగుమందులు
కరెంటు కట్... కట్..లు
పురుగులు, రోగాలు
ముప్పేట దాడి
పద్మవ్యూహంలో రైతన్న విలవిల
ఎండకు ఎండి
వానకు తడిసి
రాత్రనక పగలనక
ఆరుగాల శ్రమించి
పండించిన పంట చుట్టూ
దళారి గద్దల
కొంగజపాలు
ఋణమాఫీలు
పావలా వడ్డీలు
రైతు మిత్రలు
'రైతుబంధు'లు
ఎడారిలో ఎండమావులు
పంటనష్టపరిహారం
చంద్రునికో నూలుపోగు
రైతుపరమపదసోపానంలో
నిచ్చెనలు లేవు
అన్నీ నోళ్లు తెరిచిన పాములే!
సాలు సాలుకి
గింజగింజకి
అప్పుల కుప్పలు
రైతు ఇంట్లో
మట్టివాసన
దళారి ఇంట్లో
'పంట' వాసన

**మేరెడ్డి యాదగిరిరెడ్డి**

ఎదురుగా ఉన్న కుర్చీని చూపించాను. అంతను కూర్చున్న తరువాత "ఏమోయ్! మీ అన్నయ్యగారు వచ్చారు. కాఫీ పట్రా" అంటూ జానక్కి చెప్పాను.

"అవేం ఇప్పుడొద్దు మాష్టారూ? మీతో చిన్న పనుండి వచ్చాను"

"అయినా ఊరకరారు మహాత్ములు. చెప్పండి?"

"ఏంలేదు మాష్టారూ! మావాడి ఎమ్మెస్సీ మొన్ననే పూర్తైంది. విజయనగరంలో ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వాడికి ఈ సంవత్సరం పెళ్ళి చేసేద్దామనుకుంటున్నాను. ఆ విషయమే మీతో మాట్లాడదామని వచ్చాను"

అప్పటికి నాకు విషయం అర్థమైంది! ఇంతలో జానకి "బాగున్నారా అన్నయ్యా!?" అంటూ కాఫీలు పట్టుకొచ్చింది. రాజశేఖరం కాఫీ కప్పు అందుకుంటూ మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

"మీ పిల్ల భాను ఇంజనీరింగ్ ఈ జూన్‌తో పూర్తయి పోతుంది కాబట్టి మీకభ్యంతరం లేకపోతే భానుని మా అబ్బాయికిచ్చి వివాహం చెయ్యమని అడగటానికి వచ్చాను. ఇద్దరిదీ మంచి ఈడూజోడు; పెళ్ళి చేస్తే ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ హాయిగా కాపురం చేసుకుంటారు. మీకిష్టమైతే మాకేవిధమైన కట్నకానుకలు అక్కర్లేదు. ఆలోచించి ఏ విషయం చెప్పండి; మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన తరువాత అతని మాటలు విన్న జానకి బయటకొచ్చి "ఏమిటో ఈ విడ్డూరం! మనమేమో పిల్లవాడికి సంబంధాలు చూస్తుంటే అప్పుడే

భానుకి సంబంధాలు వచ్చేస్తున్నాయ్! పూర్వం ఆడపిల్ల పెళ్ళంటే ఎంతో కష్టపడవలసి వచ్చేది. కాళ్ళ చెప్పులు అరిగిపోయినట్లు తిరిగినా కుదిరేవి కావు.

కానీ ఈనాడు మగపిల్లల తల్లిదండ్రులే ఆడపిల్లల ఇంటికి వచ్చి ఏరికోరి ఆడపిల్లల్ని ఇవ్వమనీ బ్రతిమాలు తున్నారు. నిజంగా ఇది గొప్ప మార్పు... బహుశా దీని కంతటికీ కారణం ఆడపిల్లలు చదువుకోవడమేనని అను కుంటున్నాను. అన్నట్టు అసలు విషయం మరచి పోయాను. ఈ సాయంత్రం మీ చెల్లి, బావ వస్తున్నట్లు నిన్న రాత్రి మీ చెల్లెలు సుశీల ఫోను చేసి చెప్పింది'' అంది కాఫీ కప్పులు తీసుకెళుతూ.

''నాలుగేళ్ళ నుంచి మనింటివైపు రానివాళ్ళు ఈ రోజు ఎందుకు వస్తున్నట్లో'' అన్నాను ఆమెతో.

''నాకు మాత్రం ఏం తెలుసు చెప్పండి. రానివ్వండి చూద్దాం'' అంది.

❖ ❖ ❖

ఆ సాయంత్రం అనుకున్నట్లుగానే నా చెల్లెలు సుశీల మా బావతో కలిసి వచ్చింది. మా బావ బొబ్బిలిలో జూని యర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. వాళ్ళకి ఒక్కడే అబ్బాయి కిరణ్.

ఆ రాత్రి భోజనాల సమయంలో మా చెల్లెలు అసలు విషయం బయటపెట్టింది. ''అన్నయ్యా! మేమెందుకు వచ్చామంటే మీ మేనల్లుడు కిరణ్ పెళ్ళి విషయం మాట్లాడదామని. వాడు నీక తెలుసు కదా నెలకి యాభైవేలకి పైగా సంపాదిస్తున్నాడు. వాడికి మన భాను సరియైన జోడి అని నా అభిప్రాయం. ఇదివరకైతే మేనమామలే వచ్చి తమ పిల్లల్ని మేనల్లుళ్ళకిస్తామని అడిగేవారు; ఇప్పుడా రోజులు మారిపోయాయి. అందుకే తప్పక మేమే వచ్చాము.

అది కూడా ఇంజనీరింగ్ చదువుకుంది కాబట్టి ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా బ్రతికే స్తారు. అదిగాక మేనకోడల్ని చేసుకుంటే మళ్ళీ నా పుట్టింటికి రాకపోకలు పెరుగుతాయన్న నా స్వార్థం కూడా ఇందులో ఉందనుకో! మీకు ఇష్టం అయితే చెప్పండి; వచ్చే జూలైలోనే పెళ్ళి చేసేద్దాం. అందుకేమీ బావగారికి సెలవులేకపోయినా పట్టుబట్టి తీసుకు వచ్చాను'' గుక్కతిప్పుకోకుండా అనర్గళంగా తన కోరి కను వెలిబుచ్చింది నా చెల్లెలు.

ఆమె మాటలు విన్న నాకు ఏం చెప్పాలో వెంటనే తోచలేదు. అంత ముక్కుసూటిగా అడిగేసరికి తక్షణం స్పందించడం కష్టం అనిపించింది నాకు. అందుకే కొద్ది సేపు మౌనం వహించాను. ఆ తరువాత తేరుకొని ''ఇంకా అది నాలుగో సంవత్సరంలో ఉంది. ముందు రఘుకి ఈ సంవత్సరం ఎలాగైనా పెళ్ళి చెయ్యాలని చూస్తున్నాం. వాడి పెళ్ళి అయిపోగానే అప్పుడా విష యం ఆలోచించి చెబుతాము. ఈ విషయంలో మీరు తొందరపడొద్దు'' అన్నాను.

ఆ మర్నాడు ఉదయాన్నే వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత నాలో అంతర్మథనం మొదలైంది! మేమేమో వాడి పెళ్ళికి తొందరపడుతుంటే అదేం విచిత్రమో భానుకి సంబంధాలు వస్తున్నాయ్... ఇదొక వింత పరిణామంలా నాకనిపించింది.

ఆ మర్నాడు ఆదివారం కావడంతో భాను ఇంటి కొచ్చింది. ఆ సాయంత్రం అది డాబామీద ఒంటరిగా చదువుకుంటుండగా నేను వెళ్ళి ఆమెకోసం వచ్చిన రెండు సంబందాలు గురించి చెప్పి ఆమె అభిప్రాయం అడిగాను.

నామాటలు విన్న భాను కొద్దిసేపు మౌనం పాటిం చింది. ఆమెకూడా అంత హఠాత్తుగా నేను అడిగేసరికి ఏం చెప్పాలో తెలియక ఆలోచనల్లో పడింది. కొద్దిసేప టికి ఆమె మౌనం వీడింది.

''తెలుగు మాష్టారి గారి అబ్బాయి రవి నాకు చిన్నప్ప ట్నుంచీ తెలుసు. అతనిది నాదీ విభిన్నమైన చదువులు. అతను ఒక లెక్చరర్, రేపొద్దున్న నా ఇంజనీరింగ్ పూర్తైతే ఏ కంపెనీలోనో చేరవలసి వస్తుంది. అదీగాక మొన్న కాంపస్ సెలక్షన్స్‌లో నాకు విప్రోలో జాబ్ వచ్చింది. అదీ బెంగుళూరులో. కాబట్టి భవిష్యత్‌లో మాకు ఇబ్బందులు ఎదురవుతాయి.

ఇక కిరణ్ బావ ఇంజనీరింగ్ చదివినా మేనరికం చేసుకోవడం నాకిష్టం లేదు. డాక్టర్లు కూడా అటువంటి వివాహాలు మంచివికావంటున్నారు. కాబట్టి ఆ రెండు సంబంధాలు నాకిష్టంలేదు. ఆ విషయమే వాళ్ళకి చెప్పండి. ఇక నా వివాహ విషయం రెండేళ్ళ తరువాత నేనే చెబుతాను. అప్పుడు ఆలోచిద్దురుగాని;

అయినా పూర్వకాలంలో లాగ ఇప్పుడు నాలాంటి చదువుకున్న ఆడపిల్లల పెళ్ళిళ్ళు తల్లిదండ్రులకు పెద్ద ఇబ్బంది కాదు నాన్నగారూ! ఇప్పుడు మేమే పెళ్ళికొడు కుల్ని ఎంచుకునే రోజులొచ్చాయి. కాబట్టి మీరేమీ నా పెళ్ళి గురించి బెంగపెట్టుకోవద్దు'' అంది నవ్వుతూ.

నాకెందుకో ఆమె చెప్పింది నిజమనిపించింది. ఈకాలం ఆడపిల్లలు బాగా ఎదిగిపోయారనిపిస్తోంది భానుని చూస్తే.

❖ ❖ ❖

ఆ మర్నాడు రఘు నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఫోన్‌లో చెప్పడానికి ఇబ్బందనిపించి ఉత్తరం రాసినట్లు న్నాడు.

నాన్నగారికి,

రఘు నమస్కరించి వ్రాయునది. నాకు మొన్ననే ముప్ఫైళ్ళు నిండిపోయిన విషయం మీకు తెలుసు. ఇప్పటికే మీరు నా గురించి చాలా సంబం దాలు చూసేరు. ఈ వయస్సులో నా పెళ్ళివిషయం మీకో సమస్యగా పరిణమించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది.

అయినా ఇవ్వాల్టి పరిస్థితుల్ని చూస్తే నాకు అను కూలమైన సంబంధం దొరకడం కష్టం అనీ నేను భావి స్తున్నాను. నాకేమో నాలాగే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తూ, బెంగుళూర్‌లో ఉద్యోగం చేసే ఇరవై ఐదేళ్ళు నిండిన మన తెలుగమ్మాయిలు కావాలి. కానీ మన ప్రాంతంలో ఉన్న చాలామంది అమ్మాయిల అభిప్రా యాలు తద్విరుద్ధంగా ఉన్నాయి.

చాలామంది అమ్మాయిలకి ఇంజనీరింగ్ చదివే అబ్బాయిలు కావాలి; అబ్బాయిలు అమెరికాలో పని చేస్తుండాలి. వయస్సు ఇరవై ఐదులోపుండాలి. ఇవన్నీ కుదిరేపని కాదు. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే నాకు ముప్ఫై ఐదేళ్ళు వచ్చేసినా ఆశ్చర్యంలేదు. అందుకనీ నేను ఒక ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకున్నాను.

ఇక్కడ మా కంపెనీలోనే నాతోపాటుసంజన అనే అమ్మాయి పనిచేస్తోంది. కాకపోతే ఆమె తమిళియన్. అదీగాక ఆమె వయస్సుకూడా ఇరవై ఎనిమిది ఏళ్ళు కావడంతో నాకు అనుకూలమైనదిగా భావించాను. ఆమెకూడా చాలాసంబంధాలు చూసింది కానీ నాలాగే ఆమెకి సరియైనది కుదరలేదు.

మొన్న ఆ అమ్మాయి నన్ను పెళ్ళి చేసుకుంటానన్న ప్రపోజల్ని తెస్తే రెండు రోజులు బాగా ఆలోచించి చివ రకు ఆమెని పెళ్ళి చేసుకునేందుకు అనుకూలంగా నిర్ణ యం తీసుకున్నాను. ఈ నిర్ణయం మీకు కష్టమనిపించిన తప్పక తీసుకున్న నిర్ణయం. ఇప్పటికే ఆమె తల్లిదం డ్రులు మా వివాహానికి తమ ఆమోదాన్ని తెలిపారు.

మీకు మా వివాహం ఇష్టమైతే ఆ అమ్మాయిని మన ఊరు తీసుకువస్తాను. ఈ విషయాన్ని ఇంత ఆల స్యంగా మీకు చెబుతున్నందుకు క్షంతవ్యుణ్ణి. మీరు నా ఈ సమస్యని నా కోణంలోంచి చూసి నిర్ణయం తీసుకోండి. మీరు సరియైన నిర్ణయమే తీసుకుంటారని ఆశిస్తూ...

రఘు.

ఆ ఉత్తరాన్ని చదివి జానక్కి ఇచ్చాను. ఆమె దాన్ని చదివి నిశ్చేష్టురాలైంది. వాడు చేసిన పని కొన్నాళ్ళ క్రితం అయితే తప్పుగా అనిపించేదేమో కానీ ఇప్పుడు కాదు. ఈ తరం మగపిల్లలు చాలా సమస్యలు ఎదుర్కొంటు న్నారు. చదువుల్లో పోటీ, ఉద్యోగాల్లో పోటీ, వీటివల్ల వయసుమీదపడి చివరికి పెళ్ళికూడా ఒక సమస్యగా పరిణమిస్తోంది. చివరకు చదువుకున్న ఉద్యోగం చేస్తున్న అమ్మాయిలు దొరకడమే కష్టమైపోతోంది. అమ్మాయిల పెళ్ళిళ్ళు సులువుగా అయిపోతున్నాయి. ఇదొక కొత్త పరిణామం. ఏదైనా ఇదొక మంచి మార్పు నిపించింది నాకు.

ఆ మర్నాడే ఆ సంబంధం మాకిష్టమేనని వాడికి ఉత్తరం రాసేను. ■

## ఆవేదన

పొగల, సెగల కాలుష్యాన్ని
బలవంతంగా భోంచేస్తూ
భూగోళం భయంతో భీతిల్లుతోంది
చేదుమందు తిన్న చిన్నపిల్లాడిలా
భూగోళానికి మతిభ్రమించింది
అంధకారగోళం కానున్నాని
ఓజోన్‌చిట్లి అంతమౌతానని
తల్లడిల్లిపోతోంది...
సంబంధం చెడిన ఆడపిల్లలా
ఆకాశగంగ నీళ్ళాడటం మానేసింది
నేటి అనాగరిక మానవ వికృత చేష్టలకు!!
కాలుష్యభూతాన్ని తరిమే
వజ్రాయుధం తనవద్దలేదని
భూగోళం 'ఆవేదన' చెందుతోంది

ఈవేమన